
ఖిలావరంగల్: బొల్లికుంటలో అధికారులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


వర్ధన్నపేట: కడారిగూడెంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద


నర్సంపేట: పట్టణంలోని 2వ వార్డులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నెక్కొండ: గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న జాబితాలో పేర్లు రాని ప్రజలు


వరంగల్ కొత్తవాడ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన గ్రామసభలో దరఖాస్తులు అందజేసేందుకు బారులుదీరిన ప్రజలు

# గ్రామసభలు రసాభాస

- లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం
- అనర్హులకు జాబితాలో చోటు
- కాంగ్రెస్ కార్యకర్తలు, భూస్వాముల పేర్లు ప్రత్యక్షం
- అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు
- సమాధానం చెప్పలేక దాటవేత
- పోలీసులను మోహరించి సభల నిర్వహణ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న గ్రామసభలు రసాభాసగా మారుతున్నాయి. అధికారులు ప్రకటిస్తున్న ఇందిరమ్మ గృహాలు, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండడం, లబ్ధిదారులుగా ఎంపిక కావాల్సిన నిరుపేదల పేర్లు లేకపోవడంతో ప్రజలు అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు.**

నల్లబెల్లి, జనవరి 22: నల్లబెల్లి మండలంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలు రచ్చరచ్చగా మారాయి. నల్లబెల్లి మండల కేంద్రంలో జరిగిన సభకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరవుతున్నారనే సమాచారంతో పోలీసులు భారీగా మోహరించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, నర్సంపేట, పరకాల ఏసీపీలు కిరణ్‌కుమార్, సతీశ్‌బాబు, సీఐలు సాయిరమణ, శ్రీనివాస్, ఇంటెలిజెన్స్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్సై గోవర్ధన్, ఎస్‌బీ పోలీస్ అధికారులు నల్లబెల్లిని దిగ్బంధించారు. గ్రామసభ జరిగే ప్రాంతంలో షాపులను పోలీసులు బలవంతంగా మూయించారు. అనంతరం గ్రామసభకు చేరకున్న దొంతి సమక్షంలో అధికారులు లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు.

## జాబితాలో కాంగ్రెస్ నేతలకు చోటు

ఎంతో మంది అర్హులు ఉన్నా జాబితాలో కేవలం కాంగ్రెస్ కార్యకర్తల పేర్లతోపాటు అదే పార్టీకి చెందిన బడా భూస్వాములు, ఉద్యోగులను అర్హులుగా ప్రకటించడంపై మహిళలు మండిపడ్డారు. సభాసాక్షిగా ఎమ్మెల్యేతోపాటు అధికారులను నిలదీశారు. రైతు భరోసాతోపాటు రుణమాఫీ చేయకపోవడంపై నల్లబెల్లి మాజీ సర్పంచ్ నానెబోయిన రాజారాం ఎమ్మెల్యేను ప్రశ్నించగా, కోపంతో ఊగిపోయిన దొంతి వేదిక పైనుంచి లేచి ప్రజల్లోకి చొచ్చుకొచ్చి నిలదీసిన వారికి వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే తీరును సభకు హాజరైన వారు తీవ్రంగా ఖండించారు. అలాగే, 'సభను అడ్డుకుంటే ఊరుకోం. సమస్యలుంటే రోడ్డుపై రాస్తారోకో, ధర్నాలు చేసుకోండి. ఇది మా కాంగ్రెస్ గ్రామసభ' అంటూ వార్నింగ్ ఇవ్వడంతో గ్రామ సభ రచ్చరచ్చగా మారింది. సమస్యలు పరిష్కరించాలని పలువురు నాయకులు, మహిళలు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్‌ను కోరారు. క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించి సభ నుంచి బయటకు లాక్కెళ్లడంపై గ్రామస్తులు మండిపడ్డారు.

## పథకాల అమలు నిరంతర ప్రక్రియ

నల్లబెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గ్రామసభకు హాజరైన ఆయన మాట్లాడుతూ నల్లబెల్లిలో 150 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇస్తామన్నారు.


ఖానాపురం: మనుబోతులగడ్డలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు

## అర్హులకు సంక్షేమ పథకాలు

వర్ధన్నపేట/పర్వతగిరి: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామని కలెక్టర్ సత్యశారద అన్నారు. మండలంలోని కడారిగూడెంలో జరిగిన గ్రామసభకు ఆమె హాజరై మాట్లాడారు. సర్వేలు పూర్తి చేసి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పని చేసి పేదలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. తొలివిడతలో పథకాలు అందని వారు నిరుత్సాహ పడొద్దన్నారు. పర్వతగిరి మండలంలోని గోపనపెల్లిలో జరిగిన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని శ్రీదూడెల మల్లికార్జునస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీవో కల్పన, తహసీల్దార్ వెంకటస్వామి, గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ రాజు ఉన్నారు. కాగా, అర్హులకు పథకాలు అందడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## గందరగోళంగా గ్రామ సభలు

నర్సంపేట: గ్రామసభలు నర్సంపేట మండలంలో గందరగోళంగా సాగాయి. నిరసనలు, ఆందోళనల మధ్య రెండో రోజు సభలను అధికారులు మమ అనిపించారు. పథకాలనే అర్హులకు అందించాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. పోలీసుల పహారా నడుమ సభలు నిర్వహించడం గమనార్హం. మండలంలోని ఇటుకాలపల్లి, రామవరం, భోజ్యానాయక్‌తండా, గుర్రాల గండిరాజపల్లి, నాగుర్లపల్లిలో సభలు నిర్వహించారు. ఇటుకాలపల్లిలో మహిళలు, ప్రజలు అధికారుల తీరును ఎండగట్టారు. సభ ప్రారంభం కాగానే ఒక్కసారిగా పైకిలేచి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక అధికారులకు వినతిపత్రాలు అందించి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కోరారు. అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఏకంగా అధికారులుగా వ్యవహరించడంపై బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం తెలిపారు. నర్సంపేటటౌన్ సీఐ రమణమూర్తి బీఆర్ఎస్ శ్రేణులను సభ నుంచి పక్కకు తీసుకెళ్లారు. దీంతో సభలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రామవరం సభలో అర్హులందరికీ పథకాలు అందించాలని మహిళలు, గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో తమ పేర్లు లేవని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. భోజ్యానాయక్‌తండా, నాగుర్లపల్లి, రామవరం, గుర్రాలగండిరాజపల్లిలో బీఆర్ఎస్ నేతలు అధికారులకు వినతిపత్రాలు అందించారు. పట్టణంలోని 2, 7, 12, 17, 22వ వార్డుల్లో వార్డు ప్రత్యేక అధికారుల సమక్షంలో సభలు నిర్వహించారు. నర్సంపేట 2వ వార్డులో ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనను ఎండగట్టారు.


చెన్నారావుపేట: అమీనాబాద్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## నిరసనల మధ్య సభలు

చెన్నారావుపేట: మండలంలో రెండో రోజు నిరసనల మధ్య సభలు జరిగాయి. అమీనాబాద్, బోజెర్వు, ఎల్లాయగూడెం, కందిగడ్డతండా, జోజిపేట, నారాయణతండాలో సభలు నిర్వహించారు. అమీనాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు అమ్మ రాజేశ్, కడారి సాయిలు, మురహరి రవి అర్హుల తరఫున అధికారులను నిలదీశారు. బోజెర్వులో గడ్డల భిక్షపతి, ఇట్టబోయిన రమేశ్ అధికారుల పనితీరును ఎండగట్టారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసాలో కాంగ్రెస్ నాయకుల పేర్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా.. ప్రజాపాలనలో చేసిన దరఖాస్తులు ఏమయ్యాయని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులను మాత్రమే లబ్ధిదారులుగా చేర్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల నిర్బంధంలో సభలు నిర్వహించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

## అధికారులపై ప్రశ్నల వర్షం

రాయపర్తి: గ్రామసభలో అధికారులపై అర్హులు ప్రశ్నల వర్షం కురిపించారు. తమను ఎందుకు లబ్ధిదారులుగా గుర్తించడం లేదో తెలపాలని పట్టుబట్టారు. మండలంలోని కొలన్‌పల్లిలో గ్రామ ప్రత్యేకాధికారి బానోత్ మన్సూర్‌నాయక్, ఏవో గుమ్మడి వీరభద్రం సారథ్యంలో నిర్వహించిన సభకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారుల జాబితాల్లో పేర్లు లేని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే సభ నుంచి వెళ్లిపోయిన అనంతరం కార్యదర్శి రాకేశ్ జాబితాను వెల్లడించగా, గ్రామానికి చెందిన గుమ్మడిరాజుల దర్గయ్య ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తనను ఎందుకు చేర్చలేదని అధికారులను నిలదీసేందుకు ప్రయత్నించగా, అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అతడిని సభ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. అదేవిధంగా మాజీ ఉప సర్పంచ్ మాచర్ల విజయ సారథ్యంలో పలువురు మహిళలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు తాము ఎందుకు అర్హులం కాదో చెప్పాలని ఫీల్డ్ అసిస్టెంట్ కాడబోయిన కుమారస్వామితో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి గ్రామస్తులను సభ నుంచి బయటకు పంపించారు.

## అధికారులపై తిరగబడిన ప్రజలు

నెక్కొండ: ఆరు గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండలంలోని రెడ్లవాడలో జరిగిన గ్రామసభలో ప్రజలు అధికారులపై తిరగబడ్డారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారని, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటించి మొండిచేయి చూపారని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన అధికారులు అర్హులకు అన్యాయం చేశారని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అవకతవకలు జరిగాయిని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తోపాటు అధికారులను నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకున్నా గ్రామసభ సాఫీగా జరగలేదు. నెక్కొండలో సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అనర్హులకు చోటు కల్పించారని ధ్వజమెత్తారు. ఏనాడూ సాగు చేయని భూములకు రైతు భరోసాలో చోటు కల్పించడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధి హామీ పనులకు వెళ్లని వారి పేర్లు ఆత్మీయ భరోసా జాబితాలో వచ్చాయని కార్యదర్శి సదానందంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సై మహేందర్ సిబ్బందితో కలిసి రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. అనర్హుల పేర్లు తొలగిస్తామని తహసీల్దార్ రాజ్‌కుమార్, కార్యదర్శి సదానందం ప్రజలకు సర్దిచెప్పారు.

## వాడీవేడిగా గ్రామసభలు

ఖానాపురం: మండలంలోని మనుబోతులగడ్డ, ధర్మారావుపేట, వేపచెట్టుతండా, చిలుకమ్మనగర్, చిలుకమ్మతండాలో గ్రామసభలు వాడీవేడిగా జరిగాయి. మనుబోతులగడ్డలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అనర్హుల పేర్లు వచ్చాయని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ధర్మారావుపేట, వేపచెట్టుతండాలో ఇందిరమ్మ ఇళ్లపై అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో కాంగ్రెస్ నాయకులను అర్హులుగా గుర్తించారని బీఆర్ఎస్ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ధర్మారావుపేట, వేపచెట్టుతండాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు కావడం లేదని పలు గ్రామాల్లో అన్ని అర్హతలు ఉన్న వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాల్లో తమ పేరు రాని వారి నుంచి అధికారులు మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి గ్రామ సభలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

## అధికారులను నిలదీసిన గ్రామస్తులు

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో గ్రామ ప్రత్యేకాధికారి ఎల్.శారద అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అయితే, జాబితాలో అర్హుల పేర్లు లేకపోవడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గ్రామానికి చెందిన కొక్కరగొండ అశోక్, కొలువుల రాజు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో కౌసల్యాదేవి మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు.

## గొడవలు, నిరసనల మధ్య సభలు

గీసుగొండ/సంగెం: మండలంలోని ఆరెపల్లి కోనాయిమాకుల, హర్జ్యతండా, నందనాయక్ తండాలో గొడవలు, నిరసనల మధ్య గ్రామసభలు జరిగాయి. ఆరెపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హుల పేర్లు రాకుండా ఇళ్లు ఉన్న వారి పేర్లు వచ్చాయని గ్రామస్తులు ప్రత్యేకాధికారి హరిప్రసాద్‌తో వాగ్వాదానికి దిగారు. అలాగే, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు వచ్చాయని మండిపడ్డారు. మళ్లీ ఫీల్డ్ సర్వే చేయాలని ప్రజలు కోరారు. సంగెం మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. అర్హుల పేర్లు జాబితాలో రాకపోతే అధికారులకు దరఖాస్తులు అందించాలని డీఆర్వో విజయలక్ష్మి సూచించారు. అలాగే, సంగెం మండలంలోని రాంచంద్రాపురం, కృష్ణానగర్‌లో ప్రజలు అధికారులను నిలదీశారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని రాంచంద్రాపురంలో అధికారులను నిలదీశారు. తన పేరును రాంచంద్రాపురంలో కాకుండా గవిచర్లలో నమోదు చేశారని, ఇది అధికారుల పని తనానికి నిదర్శనమని విమర్శించాడు. అలాగే, కృష్ణానగర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్సై నరేశ్ జోక్యంతో సద్దుమణిగింది.

## ఉన్నోళ్లకు ఇండ్లు ఇస్తే ఊరుకోం..

పోచమ్మమైదాన్/ఖిలావరంగల్: ప్రభుత్వం ధనవంతులు, రెండు, మూడు ఇళ్లు ఉన్నోళ్లకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయొద్దని వరంగల్ 23వ డివిజన్ కార్పొరేటర్ ఆడెపు స్వప్న అన్నారు. కొత్తవాడ ఆటోనగర్‌లోని కమ్యూనిటీ హాల్ జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అధికారులు ప్రకటించిన రేషన్‌కార్డుల జాబితాల్లో అర్హుల పేర్లు లేవని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డుల జాబితా చిన్న అక్షరాలతో రాసి నోటీసు బోర్డుపై పెడితే ఎవరికీ సరిగా కనిపించడం లేదని, అందరికీ తెలిసేలా అధికారులు ప్రదర్శించాలని కోరారు.

## విలీన గ్రామాల్లో అదనంగా సభలు నిర్వహించాలి

ఖిలావరంగల్/కరీమాబాద్/కాశీబుగ్గ/మట్టెవాడ: విలీన గ్రామా ల్లో గ్రామ సభలు అదనంగా నిర్వహించాలని వరంగల్ 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు కోరారు. డివిజన్‌లోని బొల్లికుంట రైతు వేదికలో వార్డు సభ నిర్వహించారు. 10.30 దాటినా అధికారులు రాకపోవడంతో దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు రాలేదని, ఇటీవల దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో వచ్చాయన్నారు. అలాగే, పడమర కోటలో బొడ్రాయి వద్ద వార్డు సభ నిర్వహించారు. అండర్‌రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో వార్డు సభలు నిర్వహించారు. సభలకు వచ్చిన ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు అధికారులు బిత్తరపోతున్నారు. తాము గతంలో దరఖాస్తు చేసుకున్నా జాబితాలో రాలేదని, ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే వస్తాయా అని ప్రశ్నించారు. ప్రతిసారి దరఖాస్తు చేసుకొని అధికారుల చుట్టూ తిరగడం ఏంటని ప్రశ్నించారు. వరంగల్ 20వ డివిజన్‌లోని పద్మనగర్ పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో వార్డు సభ ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందుతాయన్నారు. వరంగల్ 29వ డివిజన్‌లో వార్డు సభ నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు కొడకండ్ల సదాంత్ వారికి వినతిపత్రం అందించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
jobs Apply Now!
★MEDICAL SHOP STAFF (Experienced.), System Operators (Exp.), Hospital Administrators (Exp.), LAB-Technicians (Exp.), OT-Technicians (Exp.) Cont: Guardian Hospital, Wgl. 12 to 2 PM.
NTW-467

★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-AII

సెప్టిక్ ట్యాంక్ క్లినర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

DOCUMENTS MISSING
My name is KOTHAPALLY SRINU, S/O SAMBAIAH R/o Potharajupally, Geesukonda Mandal, Warangal Dist. I lost my House Regd. Documents Gift Deed No. 2638/2023 while travelling from Gwmc ward office kareemabad to Potharajupally on my bike so if found please let me know Cell: 8008821132.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

## అబాకస్‌లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ

కరీమాబాద్, జనవరి 22: ఇటీవల నిర్వహించిన అబాకస్ జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని బ్రిలియంట్ స్కూల్ డైరెక్టర్లు బండి అవినాష్, బండి మోహన్ అన్నారు. ఉత్తమ ప్రతిభతో బానోత్ శశాంక్ ప్రథమ బహుమతి సాధించాడని వారు చెప్పారు. ఈ మేరకు ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని పాఠశాలలో బుధవారం విద్యార్థులను స్కూల్ నిర్వాహకులు అభినందించారు. విద్యార్థులు మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, సతీశ్ పాల్గొన్నారు.

## నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తా : దొంతి

నర్సంపేట, జనవరి 22: నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దొంతి హాజరై మాట్లాడారు. త్వరలోనే పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఆరు గ్యారెంటీల కోసం గతంలో దరఖాస్తు చేసుకోని వారు వార్డు సభల్లో మళ్లీ చేసుకోవాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలపై అధికారులకు సూచనలు చేశారు.

## 104 ఉద్యోగులకు వేతనాలు అందించాలి

పోచమ్మమైదాన్, జనవరి 22: వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న 104 కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరు నెలల నుంచి వేతనాలు అందడం లేదని, పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆందోళన చేస్తామని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ అన్నారు. జిల్లా కార్యాలయం ఎదుట బుధవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. పర్లపల్లి శ్రీనివాస్, రాజ్‌కుమార్, సృజన, మధు, క్రాంతికుమార్, సతీశ్ పాల్గొన్నారు.

## ఓటర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయాలి


ఖిలావరంగల్, జనవరి 22: ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. స్కూళ్లు, కాలేజీల్లో ఓటరు ప్రాధాన్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందించాలని డీఈవోను ఆదేశించారు. సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించాలన్నారు.

## మిర్చి నాణ్యతను గుర్తించే టెస్టింగ్ మిషన్ల ఏర్పాటు

కాశీబుగ్గ, జనవరి 22: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి నాణ్యతను గుర్తించే టెస్టింగ్ మిషన్లు ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు. మార్కెట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఆమె చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితోపాటు స్పైస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ విజ్జేష్, మిర్చి సెక్షన్ అధ్యక్షుడు కరాణి రాజు, గ్రేడ్-2 కార్యదర్శి అంజిత్‌రావుతో సమీక్షించారు. ఇక నుంచి మార్కెట్‌కు వచ్చే మిర్చి నాణ్యతను మిషన్లతో పరీక్షించనున్నట్లు చెప్పారు.

## కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం బాగుండే..

- రేవంత్‌రెడ్డిది రాక్షస పాలన
- బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, జనవరి 22: రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలన కంటే కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ పాలనే బాగుండేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పాలనంతా సర్వేలు, దరఖాస్తులతోనే సరిపోతున్నదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను పూటకో మాట, గంటకో నిర్ణయాలతో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. గత కేసీఆర్ పాలనలోనే రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లే తప్ప ప్రస్తుతం కొత్తగా లబ్ధిదారులకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన క్రిమినల్ ఆలోచనలతో పోలీసుల పహారా మధ్య గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను గోస పెడుతున్నాడని విమర్శించారు. సమావేశంలో బీజేపీ నేతలు దొంగరి మహేందర్, రంగు రాములు, సుంకరనేని కోటేశ్వర్‌రావు, బూరుగు నవీన్‌గౌడ్, రాపాక ప్రశాంత్ కుమార్, పెండ్యాల గణేశ్, మంచాల సుమన్, సురేశ్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.


## ఉర్సు దర్గాలో మంత్రి ప్రత్యేక ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

కరీమాబాద్, జనవరి 22: వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఉర్సు దర్గా 469వ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే, జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో ఉర్సు దర్గా వద్ద ఏర్పాటు చేసిన రూ. 5 భోజనం అన్నపూర్ణ క్యాంటీన్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, నాయకుడు గడ్డం యుగేందర్ పాల్గొన్నారు.

### ఫ్లెక్సీలో లేని డిప్యూటీ మేయర్ ఫొటో

తాను ముస్లిం మహిళతోపాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరలేదనే కారణంతోనే తన ఫొటోను ఉర్సులో అన్నపూర్ణ క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముద్రించలేదని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముస్లింలపై ఉన్న చిత్తశుద్ధి తెలుస్తున్నదని విమర్శించారు. ప్రజాప్రతినిధులను అవమానించే రీతిలో వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



ఫ్లెక్సీలో లేని డిప్యూటీ మేయర్ ఫొటో

## శివనగర్‌లో గుట్కాలు స్వాధీనం

ఖిలావరంగల్, జనవరి 22: శివనగర్‌లో బుధవారం రూ. 55,700 విలువ కలిగిన గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వెంశెట్టి విశ్వనాథం ఇంట్లో గుట్కాలు ఉన్నట్లు సమాచారం అందడంతో సోదాలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు.

## పంట పొలాల్లోకి ఎస్సారెస్పీ జలాలు

**50 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట**


దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతు

వర్ధన్నపేట, జనవరి 22: ఎస్సారెస్పీ డీబీఎం గేటును గుర్తుతెలియని వ్యక్తులు తెరవడంతో రామోజీ కుమ్మరిగూడెం లోని పంట పొలాల్లోకి నీరు చేరి సుమారు 50 ఎకరాల వరి పంట దెబ్బతిన్నది. ఎస్సారెస్పీ ప్రధాన కాల్వకు అనుబంధంగా ఉన్న 53 డీబీఎం గేటును మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పైకిలేపారు. దీంతో పంట పొలాల మీదుగా నీరు నల్లబెల్లి చెరువులోకి చేరింది. వరద ఉధృతికి సుమారు 50 ఎకరాల పంట దెబ్బతిన్నది. దీంతో రైతులు బోరున విలపించారు. గేటును మూసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదని చెబుతున్నారు. కాగా, ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని రైతులు వాపోయారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి సహకారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## అవార్డు గ్రహీతకు నన్నపునేని సన్మానం

పోచమ్మమైదాన్, జనవరి 22: కరాటే ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ -2025 అవార్డు గ్రహీత అక్కెల్లి వినయ్‌కుమార్‌ను వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సన్మానించారు. బుధవారం వినయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా నరేందర్‌ను కలిశాడు. ఈ సందర్భంగా అభినందించి సత్కరించారు. అలాగే, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను నన్నపునేని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, కార్యదర్శి పరికి మధుకర్, ఉపాధ్యక్షుడు కావటి సారయ్య, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

## ప్రతి ఒక్కరూ ఉత్తమ పౌరులుగా ఎదగాలి

కరీమాబాద్, జనవరి 22: చిన్నతనం నుంచే మంచి గుణాలు అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్‌స్వామి సూచించారు. వడుప్సా ఖిలావరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన ఉర్సు బైపాస్ రోడ్డులోని నాని గార్డెన్‌లో జిల్లాలోని 10వ తరగతి విద్యార్థులకు బుధవారం సాఫల్య-2025 ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చినజీయర్‌స్వామి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

## బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ

సంగెం/గీసుగొండ, జనవరి 22: యాదవ సంఘం మొండ్రాయి గ్రామ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు చెవ్వ రవీందర్ తండ్రి చిన్నస్వామి ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. అనంతరం మహరాజ్‌తండాలో మృతి చెందిన బానోత్ తిరుపతి, జేత్య కుటుంబాలను పరామర్శించారు. అలాగే, గీసుగొండ మండలంలోని మచ్చాపురం, కోనాయిమాకుల, 15వ మొగిలిచెర్ల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు గుండెబోయిన కుమారస్వామి, బెంబిరి రవి, వరికెల గోపాల్, గనిపాక కిశోర్ వివిధ కారణాలతో మృతి చెందారు. వారి కుటుంబాలను చల్లా పరామర్శించారు.